


# డబ్బు మహిమ

కథ

మల్లాది రమాంజలి

**"అమ్మా! కాస్త అన్నం పెట్టు తల్లీ! మూడు రోజుల నుంచీ కూడు లేదు తల్లీ... కాస్తంత కనికరం సూపం డమ్మా!" ముష్టివాడి కేక బయట నుంచి దీనంగా విన పడుతోంది.**

**మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం పడుతోంది. ఇంట్లో నుంచి బయటకు కదిలే పరిస్థితి లేదు. పిల్లలు స్కూల్‌కి కూడా వెళ్లటం లేదు. వానలు తగ్గే వరకూ సెలవులు ప్రకటిం చారు. పాప, బాబు కిటికీలోంచి వర్షాన్ని చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. వర్షపు ధారలు చూస్తూ... వేడివేడిగా మా ఆవిడ ఒండి పెట్టిన పకోడీలు తింటూ టీవీలో న్యూస్ చూస్తున్నాను. ముష్టివాడి కేక ఇంకా వినబడుతూనే ఉంది.**

"జయా! ఆ ముష్టివాడికి కాస్తంత అన్నం వేసి పంపించు. ఇందాకట్నుంచీ అరుస్తున్నాడు పాపం" వంట గదిలోకి చూస్తూ కేక పెట్టాను. నేను చెప్పిందే తడవుగా ఓ ప్లేట్ నిండా అన్నం, కూరా వేసి బయటకు తీసుకువెళ్లింది జయ.

చలికి ఒణుకుతూ వరండాలోకొచ్చి నిలబ డ్డాడు ముష్టివాడు. వాడికో పన్నెండేళ్లు ఉంటా యేమో... వెలిసిపోయిన నిక్కరు, చిరిగిపోయిన చొక్కా, తైలసంస్కారం లేని జుట్టూ, జిడ్డుకారుతూ ఉన్నాడు వాడు. పైగా వర్షానికి తడిసినవాడి బట్టల నుంచి మురికి వాసన వస్తోంది.

"అమ్మా! వానకి ఈ ఏలప్పుడు ఏడకీ ఎల్ల లేను.. ఈడ ఈ రేతిరికి పండుకొని పొద్దున్నే ఎల్లి పోతా.. పండుకోమంటారా"? జాలిగొలిపేట్టు అన్నాడు వాడు. జయ సందేహిస్తున్నట్లుగా నా ముఖంలోకి చూసింది. బయట వరండా ఖాళీగానే ఉంటుంది, గేట్‌కి ఎలాగూ తాళం పెడతాం... మా ప్రహరీగోడ అంత చిన్న పిల్లాడు దూకేట్టుగా ఉండదు.. పైగా దాన్నిండా గాజుపెంకులు అద్దించాం"

"ఫరవాలేదులే పడుకోనీ.. తెల్లారి వెళ్లిపోతానం టున్నాడుగా" అన్నాను.

కొత్తపిల్లాడిని చూడగానే మా పిల్లలకి ఎక్కడ లేని హుషారూ వచ్చింది. బాబు తన పాత చొక్కా, నిక్కరు తీసుకొచ్చి వాడికిచ్చాడు. పాప పాత దుప్పటీ తీసుకొచ్చి వాడికిచ్చింది. బట్టలు మార్చు కోగానే వాడికి ఎక్కడ లేని నిద్రా వచ్చినట్లుం టుంది. వెంటనే నేల మీద ఒరిగిపోయాడు. మా పిల్లరాక్షసులు ఊరుకుంటారా! వాడిని మాటల్లో దించి, వాడి పేరు గోపన్న అనీ, తనకి ఎవరూ లేరని, ఇలా వీధుల వెంట అడుక్కుంటూ బ్రతుకు తాననీ వగైరా వగైరా వాడి బయోడేటా అంతా బయటకు లాగారు. వాడి గురించి వింటున్న జయకూ, నాకూ బాధేసింది. పిల్లలు నిద్రపోయే వరకూ ఇలాటి వీధి బాలల గురించి మాట్లాడు కుంటూ, అర్థరాత్రి పక్క చేరాం.

ooo

మర్నాడు ప్రొద్దుటే మాకంటే ముందుగానే లేచి కూర్చున్నారు పిల్లలు. వరండాలోకెళ్లి గోప న్నను కూడా లేపి కూర్చోపెట్టారు. వాన తగ్గు ముఖం పట్టినా చలికి ఇంకా ఒణుకుతూనే ఉన్నాడు వాడు. వాడి కళ్లు ఎర్రగా ఉన్నాయి. దుప్పటిలోకి కాళ్లు లాక్కుని మళ్లీ నేలపై ఒరిగిపో యాడు. బహుశా జ్వరం వచ్చిందనుకుంటా.. మునివేళ్లతో వాడి నుదురు తాకి చూశాను. జ్వరం బాగా ఉన్నట్లు అనిపించింది. వాడిని చూస్తే జాలే సింది నాకు. వేడిగా ఓ కప్పు టీ ఇచ్చి జ్వరం మాత్ర ఒకటి ఇచ్చాను. ఈ పరిస్థితిలో వాడిని బయటకు తరమటం న్యాయం కాదనిపించింది. అన్నీ బాగుంటే ఎక్కడో ఓ చోట తల్లీ, తండ్రీ చాటున ముద్దుగా పెరిగేవాడు కదా! పాపం అని పించింది.

రెండు, మూడు రోజులు జ్వర తీవ్రత తగ్గేవ రకూ మా వరండాలోనే పడుకున్నాడు వాడు. నాలుగు రోజులయ్యాక....

"అమ్మా! ఇక వెడతాను" అన్నాడు.


"ఏరా! ఏమన్నా పని ఇప్పిస్తే చేస్తావా? నాలుగు డబ్బులు వస్తాయి... ఇలా అడుక్కుతినే బాధ తప్పుతుంది" అన్నాను.

"నాకు పని ఎవరిత్తారయ్యా" అన్నాడు. నమ్మ కంగా చేస్తానంటే పని ఇప్పిస్తానన్నాను. సరేన న్నాడు వాడు. మా వీధి చివర ఉన్న సైకిల్ షాప్‌కి వెళ్లి అప్పటికప్పుడే పనిలో పెట్టాను. షాపు ఓనర్ తెలిసిన వాడు కావటం వల్ల వాడిని పనిలో పెట్టు కొని, రోజుకు ఐదు రూపాయలు ఇస్తానన్నాడు. సంతోషంతో ఒప్పుకున్నాడు గోపన్న.

ooo

ఐదు వేళ్లూ లోపలికి వెళ్లటం మొదలుపెట్టాక గోపన్న పుష్టిగా, నీట్‌గా తయారయ్యాడు. తిండికి పోను తను దాచుకున్న డబ్బుల్లో ఓ జత లాగూ, చొక్కా కుట్టించుకున్నాడు. వాడి నిజాయితీ గురించి షాప్ ఓనర్ తృప్తిగా చెప్పటంతో తేలిగ్గా నిట్టూర్చాను. షాప్ పని అయిపోగానే సాయంత్రం పూట మా ఇంటికి వచ్చి, మా తోటపని చూస్తూ ఉంటాడు గోపన్న. వాడి చేత్తో ఏ మొక్క పెట్టినా, బంగారంలా పెరుగుతుందని త్వరలోనే గ్రహిం చాను.

"వీలు చూసుకుని స్కూటర్, కారు రిపేర్ పని నేర్చుకోరా" అని సలహా ఇచ్చాను. ఓనర్‌ని అడిగి




ఓ కిలోమీటర్ దూరంలో ఉన్న గేరేజ్‌కి వెళ్లి ఆ పని నేర్చుకోవటం మొదలుపెట్టేడు గోపన్న. కుర్రాడు తన దగ్గరే ఉంటే ఆ పన్లు కూడా తీసుకోవచ్చని షాప్ ఓనర్ ఆశించినట్టున్నాడు. వీడికి మరేం అడ్డు చెప్పలేదు. ఓ నాలుగైదు ఏళ్లల్లో మంచి మెకానిక్‌గా పేరు తెచ్చుకున్నాడు గోపన్న. లాగూల్లోంచి, పేంట్లలోకి మారే వయసొచ్చింది వాడికి. ఒకప్పుడు వాడు ముష్టివాడంటే నమ్మలేని స్థితిలోకొచ్చాడు వాడు.

కష్టపడి పనిచేసే వాడి తీరు చూస్తుంటే ముచ్చటగా ఉంటుంది నాకు. షాప్ ఓనర్ అనుమతి ఇవ్వటంతో వాళ్లింటి పక్కనే గోపన్న కోసం ఓ పాక వెలసింది. ఒండుకునేందుకు నాలుగు గిన్నెలూ, ఓ కిరోసిన్ స్టౌ అన్నీ అమర్చుకున్నాడు.

స్కూటర్, కార్ రిపేర్లు కూడా చేయటంతో వాడి ఆదాయం పెరిగింది.

"మంచి కుర్రోడిని అప్పజెప్పారు సారూ! ఈడొచ్చాక నా సెక్రం బాగానే తిరిగినాది" ఓ నాడు షాపు ఓనర్ రమణయ్య సంతోషంగా చెప్పాడు.

"మంచిదే కదయ్యా! సకల జనులూ సుఖీభవా... అన్నట్లుగా, ఎవరిబిడ్డో ఇక్కడికొచ్చి స్థిరపడ్డాడు... వాడు పైకొస్తే మంచిదే కదా!" అన్నాను. మరో రెండేళ్లల్లో గోపన్న మంచి రాటు తేలాడు. పనిలో పడితే తిండి ధ్యాసే ఉండేది కాదు వాడికి. వంట చేసుకోని నాడు జయ దగ్గరకు వచ్చి కూరలవీ తీసుకుని వెడుతూ ఉంటాడు.

ఓ రోజు మార్కెట్‌కని బయలుదేరిన నాకు స్కూటర్ స్టార్ట్ చేయగానే బుర్రుమని మోగుతూ పనిచేయక మొరాయించింది. గోపన్న షాపుకి తీసుకువెళ్లమని మా బాబుకి పురమాయించి, నేను ఆటోలో బయలుదేరాను. మార్కెట్ నుంచి వస్తుండగా ఆటో ఆపి... "స్కూటర్ బాగై పోయిందయ్యా! పట్టుకెళ్లండి" అన్నాను గోపన్న. ఆటోవాడికి డబ్బులిచ్చి పంపేసి, స్కూటర్ స్టార్ట్ చేశాను.

"సార్! నేను మీ ఇంటికి వచ్చిన కాడి నుంచీ ఇదే బండి నడుపుతున్నారు తమరు.. శానా పాతదైపోనాది. కొత్తబండి కొనుక్కోండి సారూ! ఈ డొక్కు బండితో ఎన్నాళ్లు ఏగుతారు?" ఓ ఉచిత సలహా ఇచ్చాడు. ఓ క్షణం చివుక్కుమనిపించినా... మళ్లీ తేరుకొని...

"సర్లేరా! బండి కొనాలంటే మాటలా! నలభై, ఏభై వేలు పెడితే గానీ రాదు... పాప, బాబు చదువులకొచ్చారు కదా! నడవనీ... కొంతకాలం"... అని బండి స్టార్ట్ చేసి ఇంటివైపు పోనించాను. గోపన్న మాటలే చెవులలో వినిపిస్తున్నాయి నాకు... వాడి మాటల్లో ఎగతాళి ఉన్నదా అనే ఓ పిచ్చి సందేహం నాకు. తల విదిలించి మరో పనిలో పడిపోయాను.

ooo

మరో రెండేళ్లకు గోపన్న పాక స్థానంలో రాతి గోడల ఇల్లు వెలసింది. ఓనరు రమణయ్య కూతురు నాంచారీని గోపన్నకిచ్చి పెళ్లి చేయడానికి ముహూర్తం నిర్ణయించారు.

"పిల్లోడు బంగారం సారూ! ఏ పనిలో ఎట్టినా సూసిరమ్మంటే కాలిసొచ్చే రకం... పిల్లనిత్తే ఇద్దరూ నాకాడే పడుంటారని అనుకున్నా... అమ్మా, అయ్యా నేకపోతే ఏం... నేనూ, నా పెల్లాం ఉన్నాంగందా! పిల్ల కూడా ఇట్టపడినాది".... శుభలేఖ ఇవ్వటానికి వచ్చిన రమణయ్య చెప్పుకొచ్చాడు.

"అవునులే రమణయ్యా! మంచి పనే చేస్తున్నావ్.... నీకూ పెద్దతనంలో చేదోడువాదోడుగా

ఉంటాడు... వాడికేమన్నా వస్తువు అమర్చు" అంటూ... ఓ ఐదువందలు తీసి రమణయ్య చేతిలో పెట్టాను.

"ఎందుకులే అయ్యా!" అంటూ మొహమాటం గానే తీసుకున్నాడు రమణయ్య.

గోపన్న పెళ్లి బాగానే జరిగింది. పెళ్లి కాగానే పెళ్లాన్ని తీసుకొని మా ఆశీర్వాదం కోసం వచ్చాడు వాడు. బొట్టు పెట్టి, నాంచారి చేతిలో ఓ సిల్కు చీర పెట్టింది జయ.

రాతిగోడల ఇంట్లో ఆనందంగా కాపురం పెట్టారు, గోపన్న, నాంచారి. ఇంట్లోకి కావల్సిన వస్తువులన్నీ అమర్చుకున్నాడు గోపన్న. వాళ్ల సంసార యాత్ర ఆనందంగానే సాగిపోతోంది. పెళ్లయిన వేళా విశేషాన గోపన్న, నాంచారి చేత కొత్తగా పెట్టించిన టీకొట్టు మీద కూడా బాగానే రాబడి వస్తోంది. నాంచారి మెళ్లో ఒకటీ అరా బంగారు నగలు బాగానే మెరుస్తున్నాయి.

ooo

ఆ రోజు షాపు పని నాంచారికి అప్పజెప్పి తీరిగ్గా మా ఇంటికి వచ్చి కూర్చున్నాడు గోపన్న. కూలి, నాలి చేసుకునే జనాలకి తక్కువ వడ్డీతో అప్పులివ్వాలని, ఆ వ్యాపారం కొత్తగా మొదలుపెట్టబోతున్నానని చెప్పాడు గోపన్న.

"ఎందుకురా రిస్కు... వాళ్లు సరిగా కట్టకపోతే నీకే కదా నష్టం" అన్నాను.

"నష్టం ఏముంటాది సారూ! డబ్బు కట్టకపోతే ఆల్లని బయటికి లాగి.... చెంబూ, తప్పేలా ఎత్తుకొత్తానంటూ" దాదాగిరీ మాటలు మొదలుపెట్టాడు గోపన్న. సంపాదనా దాసంతో వీడికి ఉచ్చం, నీచం తెలీటం లేదా! అనిపించిందో క్షణం. పన్నెండేళ్ల పసి వయస్సులో మా వాకిట్లో కొచ్చిన వీడికీ, ఇప్పటి గోపన్నకీ సహస్రం తేడా కనిపించింది నాకు. నిజాయితీగా సైకిల్ షాపులో పని చేసుకునే గోపన్నని 'డబ్బు' దాదాని చేస్తోందా అనే భయం నా వెన్నులో సన్నగా ఒణుకు తెప్పించింది.

"ఎందుకురా గోపన్నా! షాపు మీద నువ్వు సంపాదిస్తున్నావు. టీకొట్టు మీద నీ పెళ్లాం సంపాదిస్తోంది.... చాలదా నీకు... నీ మావ ఇల్లు నీది కాదా! నీవు ఉంటున్న ఇల్లు నీ కష్టార్జితం కాదా! రెండు ఇళ్లు, రెండు కొట్లు ఉన్నాయి. బ్రతకటానికి అది చాలు... ఈ పిచ్చి ఆలోచనలు చేసి ఉన్నది పోగొట్టుకోకు" మందలిస్తున్నట్లు అన్నాను.

నా మాటలు చెవికెక్కినాయో లేదో గానీ.. తల వంచుకొని ఆలోచనలో పడ్డాడు గోపన్న. అప్పటివరకూ మా మాటలు వింటున్న జయ ఏదో గుర్తుకు వచ్చినట్లుగా ఇంట్లోకి నడిచి.... ఓ స్టీల్ బాక్స్ పట్టుకొచ్చింది.

"గోపన్నా! ఈ రోజు పాప, బాబూ కాలేజీ నుంచి ఏదో పార్టీకి వెళ్లారట... రాత్రికి భోజనానికి రామని చెప్పారు. కూరలన్నీ అలాగే ఉండిపోయినాయి. నాంచారీ, నువ్వూ తినండి" అంటూ గోపన్నకి బాక్స్ అందివ్వబోయింది జయ.

బాక్స్ వంకా, జయ వంకా ఓ క్షణం మార్చి మార్చి చూసి....

"ఒద్దండమ్మగారూ! నాంచారి సేపల కూర సేత్తానన్నాది... ఏడేడిగా ఇద్దరం కబుర్లు సెప్పుకుంటూ తింటాం. కబుర్లలో పడి మరిసే పోయా. అది నా కోసం ఎదురు సూత్తా ఉంటాది. ఆ కూరలు ఏ ముట్టోడికో ఎయ్యండి" అంటూ ఎరో తరిమినట్లుగా గబగబా గేటు దాటాడు గోపన్న. వాడి మాటలకి తెల్లబోయింది జయ. ఆమె ముఖం చూస్తే నవ్వొచ్చింది నాకు.

"ఓసి పిచ్చి ముఖమా! వాడు అప్పటి ముష్టి గోపన్న అనుకున్నావా! ఇప్పుడు వాడో దాదా గోపన్న కాబోతున్నాడు. డబ్బు చూడనంతకాలం వాడో పిల్లి... డబ్బు చూశాక వాడో నరమాంసం రుచి చూడబోయే పులి. డబ్బు మనిషిని ఎన్ని కుప్పిగంతులైనా వేయిస్తుంది. ఈ ఆశ వాడిని అందలానెక్కిస్తుందో అగాధంలోకి తోసేస్తుందో... ఆ పైవాడే నిర్ణయిస్తాడు, పద భోజనం చేద్దాం" అంటూ జయను లోపలికి నడిపించాను.

o



## మీరా గోల!

ఇటీవల విడుదలైన 'జగన్మోహిని'లో హీరోయిన్‌గా నమిత నటించిన సంగతి అందరికీ తెలుసు. అయితే మరో హీరోయిన్‌గా మీరా చోప్రా కూడా నటించింది. సినిమా ఆరంభం కాక ముందు తన పాత్రకీ ఎంతో ప్రాధాన్యత వుందని చెప్పి షూటింగ్ కూడా బాగానే చేసిన నిర్మాతలు తీరా సినిమా విడుదలప్పుడు తన పాత్ర బాగా కుదించేసారని తెగ వాపోతోంది మీరా ఇప్పుడు. నమిత పాత్రనే హైలైట్ అయ్యేలా సీన్లున్నాయని తన పాత్రకి అన్యాయం జరిగిందని మండిపడుతోందిట మీరా. అయినా ఏం చేసి ఏం లాభం సినిమా మాత్రం ఫ్లాపేగా!